సీఎంఆర్ఎఫ్ పేదలకు సంజీవని

ఖాప్రిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న సర్పంచ్ ఎల్టీ రమీల

జైనథ్, అక్టోబర్ 2 : సీఎంఆర్ఎఫ్ పేదలకు సంజీవనిలా మారిందని సర్పంచ్ ఎల్టీ రమీలా వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఖాప్రి గ్రామానికి చెందిన బద్దం రాధబాయికి రూ.37వేలు, ఎల్మ గీతకు రూ.12వేలు, నరేశ్‌రెడ్డికి రూ.11 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు కావడంతో సోమవారం సర్పంచ్ ఎల్టీ రమీలావెంకట్ రెడ్డి బాధితులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఆసరా పింఛన్ మంజూరైన గడమాల లక్ష్మి, తల్లపెల్లి గౌరుబాయికి మంజూరు పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోమ రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సూరజ్, ఉప సర్పంచ్ మురళీధర్, నాయకులు వెంటి, రామన్న, పాల్గొన్నారు.

ఆశ్రమోన్నత బాలికల పాఠశాల తనిఖీ

విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జీసీడీవో మెస్రం ఛాయ

బేల, అక్టోబర్ 2 : విద్యార్థులు మహాత్ముల జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చదవి తెలుసుకోవాలని ఐటీడీఏ జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. మండలంలోని చండ్‌పల్లి గ్రామంలోని ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించి గ్రూపులుగా విభజించి వారికి ప్రత్యేకంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి ఒక్కరూ 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

చేపల పెంపకం ద్వారా ఆర్థికంగా ఎదగాలి

చెరువులో చేప పిల్లలు విడుదల చేస్తున్న గిరిజన మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 2: చేపల పెంపకం ద్వారా గిరిజన మత్స్య పారిశ్రామిక పరపతి సహకార సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్యశాఖ అధికారి రాథోడ్ సురేశ్, జిల్లా పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావ్ అన్నారు. సోమవారం మండలంలోని నర్సాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గండిగూడకు చెందిన గిరిజన మత్స్య పారిశ్రామిక పరపతి సహకార సంఘం సంబంధించిన చెరువులలో సంఘ సభ్యులతో కలిసి చేప పిల్లలు విడుదల చేశారు. అదేవిధంగా మండలంలోని ఘోట్టి, దొడంద, సాకేరా, నర్సాపూర్, గట్టిపల్లి, సాలేవాడ(బీ), సాలేగూడ, కొప్పర్‌ఘడ్ చెరువుల్లో గిరిజన మత్స్య సహకార సంఘాలకు 3 లక్షల చేప పిల్లలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెసా జిల్లా కోఆర్డినేటర్ వసంత్‌రావ్, నర్సాపూర్ సర్పంచ్ పెందూర్ కళావతి, గ్రామ పటేల్ సుంగు, ఆయా గ్రామాల మత్స్య పారిశ్రామిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కౌఠ(బీ)లో గణేశ్ నిమజ్జనం

బోథ్, అక్టోబర్ 2: మండలంలోని కౌఠ (బీ) గ్రామంలో సోమవారం సాయంత్రం గణేశ్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. 15రోజుల ఉత్సవాల అనంతరం విగ్రహాలను అందంగా అలంకరించి ట్రాక్టర్లలో కూర్చుండబెట్టారు. డీజే సౌండ్ సిస్టంల నడుమ గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. రెడ్డి గణేశ్ మండపం, రెడ్డి (బీ) గణేశ్ మండపం, కొత్త కాలనీ, అంబేద్కర్ కాలనీ, రజకకాలనీ, ముదిరాజ్, కొత్త కాపు వాడకట్టు గణేశ్ మండపాలవారు శోభయాత్రలో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అర్ధరాత్రి సమయంలో కన్గుట్ట పెద్దవాగులో విగ్రహాలను నిమజ్జనం చేసారు. బోథ్ సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాము బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 2 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉజ్వల భవితను పొందాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే కళాశాలలో సోమవారం నిర్వహించిన బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14, 19 క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఊ తెలంగాణ సాధించిన తర్వాత 327 గురుకులాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు ఆసక్తి కలిగిన క్రీడల్లో తగిన ప్రోత్సాహం ఇస్తున్నామని పేర్కొన్నారు. క్రీడల్లో నైపుణ్యాలను మెరుగు పర్చుకుంటూ ఉత్తమ ఫలితాలు పొందాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై సత్తాచాటాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులాల ఆర్సీవో గోపిచంద్, ప్రిన్సిపాల్ విద్య, కౌన్సిలర్ పవన్ నాయక్, రుక్మారెడ్డి, కలీం పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేత

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 2: పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సోమవారం క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎన్నికైన కమిటీ సభ్యులు

ఎదులాపురం, అక్టోబర్ 2 : న్యూహౌసింగ్ బోర్డు జోన్ 1 నూతన కమిటీని సోమవారం కాలనీ వాసులు ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా శివన్న, సుభాష్, నాగేశ్వరరావు, విజయ్ రావు , ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, కోశాధికారి రాజేశ్వర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వినోద్ రెడ్డి, తులసీరాం, దయాకర్, కార్యదర్శులుగా అజయ్, భరత్, శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, గజానన్, గౌతమ్, రమేశ్, సలహాదారులుగా సత్యనారాయణ గౌడ్, వెంకట్‌సార్, డాక్టర్ దూదురాం, రమేశ్, చిన్నారెడ్డి, రాజేశ్వర్, వెంకట్రావు, జయనారాయణ రెడ్డి, భూపాల్ , శ్రీనివాస్, నర్సయ్య, గంగాధర్, సంతోష్, ఆడిట్ కమిటీ సభ్యులుగా రాజేశ్వర్, రమేశ్‌ను ఎన్నుకున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలి

మాట్లాడుతున్న డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్

ఇంద్రవెల్లి, అక్టోబర్ 2: పాస్టిక్ వాడక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్నూర్, ఇంద్రవెల్లి, కేస్లాపూర్, గిన్నేరా, ఏమాయికుంట, ఈశ్వర్‌నగర్, గౌరాపూర్, శంకర్‌గూడ, సమక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముత్నూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, బాగుబాయి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగించకుండా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంతోష్, ఇంద్రవెల్లి జీపీ ఈవో సంజీవరావ్, ముత్నూర్ జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్, మండల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

ఇచ్చోడ, అక్టోబర్ 2 : ఇచ్చోడ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్ రెడ్డి అన్నారు. సోమవారం సర్పంచ్ సునీత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఈవో సూర్యప్రకాష్, బిల్ కలెక్టర్ రాజేశ్వర్, వార్డు సభ్యులు భూమన్న, శ్రీరాం, పీహెచ్‌సీ సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జైనథ్, అక్టోబర్ 2 : ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యురాలు నయనత సూచించారు. సోమవారం జైనథ్‌లో ఆయుష్మాన్ భవ, గ్రామసభ నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్టీ రమీల, పంచాయతీ కార్యదర్శి ముజిప్, హెల్త్ సూపర్‌వైజర్ వేణు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తాం

బేల, అక్టోబర్ 2 : గ్రామంలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని డోప్టాల సర్పంచ్ రాకేశ్ అన్నారు. సోమవారం బేల, డోప్టాల, చప్రాల, శంషాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

79వ రోజుకు చేరుకున్న దీక్షలు

బోథ్, అక్టోబర్ 2 : బోథ్‌ను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 79వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో మండల కేంద్రానికి చెందిన యువకులు కూర్చున్నారు. వీరికి వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాపు డైరీ పంపిణీ

డాక్టర్ రవీంద్ర ప్రసాద్‌కు డైరీ అందజేస్తున్న గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా అధ్యక్షుడు

బోథ్, అక్టోబర్ 2: మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని సోమవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా అధ్యక్షుడు మెస్రం భూమన్న బాపు డైరీని బోథ్ సివిల్ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర ప్రసాద్, జడ్పీటీసీ సంధ్యరాణికి అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సోలంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం

బోథ్, అక్టోబర్ 2: 17 సంవత్సరాలు ఇండియన్ ఆర్మీలో దేశ సేవ చేసి ఉద్యోగ విరమణ పొందిన కేంద్రె భగవాన్‌ను సోమవారం సోనాలలోని రామ మందిరంలో మాజీ సర్పంచ్ నరోత్తం రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణ పాల్గొన్నారు.